క్లుప్తంగా

రాష్ట్రంలో సంక్షేమ పాలన



వీరభద్రీయ కుల సంఘం కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న వకుళాభరణం కృష్ణమోహన్‌రావు

గౌతంనగర్: సామాజిక న్యాయం బలహీన వర్గాలకు సమపాళ్లలో అందిస్తూ రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి దిశగా పాలన కొనసాగుతోందని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. నూతన తెలుగు సంవత్సరం శోభకృత్ ఉగాది సందర్భంగా జాతీయ వీరభద్రీయ కుల సంఘం ప్రచురించిన కేలండర్‌ను ఆయన నగరంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఉపేంద్ర కర్నె, రాష్ట్ర అధ్యక్షుడు చెవ్వ పాండు, ప్రతినిధులు చెవ్వ అంజయ్య, మల్లూరి అనిల్‌కుమార్, చెవ్వ కుమార్, మల్లూరి రమాదేవి, గుంటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కార్పొరేటర్ సొంత నిధులతో ప్యాచ్‌వర్క్



బోడుప్పల్: అన్నపూర్ణ కాలనీ, పద్మావతి కాలనీ చౌరస్తా రోడ్డు ప్యాచ్ వర్క్‌ను గురువారం 13వ డివిజన్ కార్పొరేటర్ దానగల్ల అనితాయాదగిరి తన సొంత నిధులు రూ 35 వేలు ఖర్చు పెట్టి చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రోడ్డు అధ్వానంగా ఉండడంతో స్థానికుల పిలుపు మేరకు ఈ పనులు చేపట్టినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, సభ్యులు బుచ్చిరెడ్డి, రాఘవేంద్రరావు, సందేశ్‌రెడ్డి, నిఖిల్‌కుమార్ పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



ఉత్తంనగర్‌లో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

గౌతంనగర్: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని గౌతంనగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీతా యాదవ్ అన్నారు. గురువారం ఉత్తంనగర్‌లో రూ. 55 లక్షల రూపాయలతో కొనసాగుతున్న బ్యాక్స్ డ్రైన్ నాలా స్లాబ్ నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. పనులు వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. డివిజన్‌లోని పలు ప్రాంతాలలో పెండింగ్‌లో ఉన్న పనులను ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్ నేత మేకల రాముయాదవ్, ఏఈ. దివ్య జ్యోతి, వర్క్స్ ఇన్‌స్పెక్టర్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా గ్రాడ్యుయేషన్ డే



పట్టాలు అందుకున్న చిన్నారులను అభినందిస్తున్న పాఠశాల నిర్వాహకులు

అల్వాల్: అల్వాల్ త్రివేణి పాఠశాలలో గురువారం గ్రాడ్యుయేషన్ డే సందడిగా సాగింది. ఈ సందర్భంగా యూకేజీ పిల్లలకు గ్రాడ్యుయేషన్ పట్టాలు ప్రదానం చేసి సత్కరించారు. కార్యక్రమానికి డాక్టర్ నటరాజ్, ప్రిన్సిపాల్ సుబ్బారావు, సీఆర్‌ఓ వెంకట్‌రావు హాజరై చిన్నారులను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుధ, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పనులను పరిశీలించిన కార్పొరేటర్

రామంతాపూర్: రామంతాపూర్‌లోని భరత్‌నగర్, రామ్‌శంకర్‌నగర్‌లో జరుగుతున్న యూజీడీ లైన్ పనులను గురువారం కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావు పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆమె అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఈ నాగమణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేందర్, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు బండారు వెంకట్రావు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమార్కులను వణికించి... అభాగ్యులకు అండగా నిలిచి..

- సాక్షి కథనాలతో ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల్లో కదలిక
- సామాన్యులకు, విద్యార్థులకు బాసటగా..

అక్రమాలకు పాల్పడే వారి గుండెల్లో రైళ్లు పరుగెత్తించి, అభాగ్యులకు అండగా నిలవడంలో సాక్షి దినపత్రిక ముందువరుసలో నిలిచింది. సాక్షిలో ప్రచురితమైన పలు కథనాల కారణంగా ఉన్నతాధికారులు ఓ సర్పంచ్‌తో పాటు గ్రామ కార్యదర్శిని సస్పెండ్ చేయడంతోపాటు పలు సమస్యలను పరిష్కరించారు. – మేడ్చల్ రూరల్

విద్యార్థుల సమస్యకు పరిష్కారం



విద్యార్థుల సమస్యల పరిష్కారంలోనూ సాక్షి ముందుంది. 2018 మార్చి నెలలో మేడ్చల్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యుత్ బిల్లు చెల్లించలేదని కరెంట్ సరఫరా నిలిపివేశారు. మార్చి 9న సాక్షి దినపత్రికలో 'సర్కారు బడికి విద్యుత్ కష్టాలు' అనే శీర్షికను ప్రచురించగా వెంటనే స్పందించిన నాటి జిల్లా కలెక్టర్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఒక్కరోజు గడవకముందే విద్యుత్ సరఫరా తిరిగి ప్రారంభించారు.



దారికొచ్చిన విద్యుత్ సిబ్బంది



మండలంలో విద్యుత్ శాఖ పనితీరు, సిబ్బంది చేతివాటాన్ని వెలికితీస్తూ 2023 జనవరి 20వ తేదీన 'కరెంట్ శాఖలో కాసుల కక్కుర్తి' అనే శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీంతో విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు సిబ్బందికి మొటిక్కాయలు వేసారు. అప్పటినుంచి వారి పనితీరులో మార్పు రావడంతో సాక్షి కథనం వల్లే తమకు ఇబ్బందులు తొలగాయంటూ స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఏకంగా సర్పంచ్‌పైనే వేటు



మేడ్చల్ మండలంలోని ఎల్లంపేట్ గ్రామంలో సర్పంచ్ వెన్నెల రామకృష్ణుడు, గ్రామ కార్యదర్శి విజయ్‌కుమార్ ఏకమై అధికారాన్ని అడ్డుపెట్టుకుని గ్రామంలో ఉన్న 12 వేల గజాల గ్రామ కంఠం భూమిని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఆ భూమిని అక్రమార్కుల పరం చేస్తూ వాటికి గ్రామ పంచాయతీ సర్టిఫికెట్ జారీ చేసి రూ.కోట్ల రూపాయలు దండుకునేందుకు యత్నించారు. ఈ విషయాన్ని 2021 డిసెంబర్ 23వ తేదీన సాక్షి దినపత్రికలో 'అంతా మా ఇష్టం' పేరుతో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి జిల్లా స్థాయిలో అధికారులు స్పందించి విచారణ చేపట్టారు. ఈ విచారణలో గ్రామ సర్పంచ్ వెన్నెల రామకృష్ణుడు, గ్రామ కార్యదర్శి విజయ్‌కుమార్‌లు అధికార దుర్వినియోగానికి పాల్పడినట్టు తేలడంతో సరిగ్గా నెల రోజులకు అంటే 2022 జనవరి 23న జిల్లా కలెక్టర్ వారిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అక్రమార్కుల చేతిలోకి వెళ్లిన గ్రామ కంఠం స్థలాన్ని తిరిగి స్వాధీనం చేసుకున్నారు. దీంతో సాక్షి కథనంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.



ముంపు సమస్యకు చెక్





మండలంలోని పూడూర్ పాఠశాల మైదానం లోతట్టుగా ఉండడంతో వర్షం వచ్చినప్పుడల్లా సమీప కాలనీల నీళ్లు సర్కార్ బడిలోకి చేరి చెరువుగా మారుతుండేది. వానొచ్చే వరదొచ్చే అనే శీర్షికతో పాఠశాల మైదానం సమస్యను ప్రతిబింబించేలా కథనం ప్రచురించడంతో స్పందించిన అధికారులు, గ్రామ పాలకవర్గం మైదానంలో మట్టిపోసి వర్షపునీరు నిలవకుండా చదును చేసి సమస్యను పరిష్కరించారు. దీంతో ఆయా పాఠశాలల విద్యార్థులు సాక్షి దినపత్రికకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

సాక్షి కథనంతో పాఠశాల రూపురేఖలు మారాయి



ప్రభుత్వ పాఠశాలలో వర్షం వచ్చిందంటే చాలు మైదానంలో నీళ్లు నిలిచి చెరువులా కనిపించేది. సమస్యపై సాక్షిలో కథనం రావడంతో సమస్య పరిష్కారమైంది. పాఠశాల ఆవరణను మట్టితో చదునుచేసి నీరు నిలవకుండా చేయడంతో పాటు ఇటీవల సెహగల్ ఫౌండేషన్ వారు పాఠశాలను మరింత అభివృద్ధి చేస్తున్నారు. ప్రత్యేక కథనంతో విద్యార్థుల సమస్యను తొలగించినన సాక్షి దినపత్రికకు ప్రత్యేక ధన్యవాదాలు. – శ్రీకాంత్, వార్డు సభ్యుడు పూడూర్

నిజాలను నిర్భయంగా వెలికి తీస్తున్న సాక్షి



నిజాన్ని నిర్భయంగా వెలికితీసి తమ కథనాలతో సాక్షి పత్రిక అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. ఇటీవల విద్యుత్ శాఖ సిబ్బంది తీరును కళ్లకు కట్టేలా ప్రచురించడం అభినందనీయం. ఆ కథనంతో సిబ్బంది తీరులో మార్పు వచ్చింది. ఇలాంటి మరెన్నో కథనాలను ప్రచురించాలని కోరుకుంటున్నా. – నరేశ్, మేడ్చల్

నేడు కంటి వెలుగు శిబిరం ప్రారంభం

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని 21వ డివిజన్ బాలాజీ హిల్స్ కాలనీ ఫేజ్ 3 చిల్డ్రన్స్ పార్కు వద్ద శుక్రవారం ఉదయం 9 గంటలకు కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు కార్పొరేటర్ భూక్యా సుమన్‌నాయక్ ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ నెల 24 నుంచి ఏప్రిల్ 4 వరకు ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కంటి వెలుగు శిబిరం ప్రారంభోత్సవానికి మేయర్ సామల బుచ్చిరెడ్డి, డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మి రవిగౌడ్ హాజరై ప్రారంభిస్తారన్నారు. ఈ అవకాశాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎమ్మెల్యే మైనంపల్లికి కృతజ్ఞతలు

గౌతంనగర్: సఫిల్‌గూడ రైల్వే స్టేషన్ నుంచి ఏఓసీ మిలటరీ రోడ్డు కొంతకాలంగా గుంతలు ఏర్పడి అధ్వానంగా తయారు కావడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు దృష్టికి వాహనదారులు, ప్రజలు తీసుకెళ్లడంతో ఆయన సంబంధిత మిలటరీ అధికారులతో మాట్లాడి రోడ్డు వేయించారు. దీంతో స్థానికులు, వాహనదారులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

డివిజన్ అభివృద్ధికి కృషి



కార్పొరేటర్ సబితాకిషోర్‌కు వినతి పత్రం అందజేస్తున్న శ్రీనివాస్‌నగర్ కాలనీ వాసులు

అల్వాల్: వెంకటాపురం డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నామని స్థానిక కార్పొరేటర్ సబితాకిషోర్ అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ మరమ్మతులు చేపట్టాలని కాలనీవాసులు కార్పొరేటర్‌కు వినతి పత్రం అందజేశారు. స్పందించిన కార్పొరేటర్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఈ చంద్రయ్య, వెంకట్, ప్రకాష్, కాలనీ వాసులు రఘుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీహాల్ నిర్మాణానికి తొలగిన అడ్డంకులు



కాలనీవాసులు, కార్పొరేటర్ సమక్షంలో స్థలం పత్రాలను అందజేస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఉప్పల్: దశాబ్దకాలంగా ఎదురు చూస్తున్న కాలనీ వాసులు నిరీక్షణకు చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత చొరవతో బ్రేక్ పడింది. కమ్యూనిటీహాల్‌కు స్థలం లేకపోవడంతో డివిజన్ పరిధిలోని రాఘవేంద్రనగర్ కాలనీవాసులు ఇబ్బందులు పడ్డారు. ఎంతోమంది ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేకపోయింది. చివరకు కార్పొరేటర్ బన్నాల గీత చొరవ తీసుకుని ఉప్పల్ తహసీల్దార్ గౌతంకుమార్‌తో మాట్లాడి దాదాపు 243 గజాల స్థలాన్ని సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులకు ఇచ్చారు. దీంతో కాలనీల్లో గురువారం సంబరాలు చేసుకున్నారు. సదరు స్థలానికి సంబంధించిన పత్రాలను జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులకు రెవెన్యూ అధికారులు అందజేశారు. త్వరలోనే మల్టీపర్పస్ కమ్యూనిటీహాల్ నిర్మించి కాలనీవాసులకు అందజేయనున్నట్లు కార్పొరేటర్ తెలిపారు.

ఈఎస్‌ఐ కార్మికులకు జీతాలు పెంచాలని వినతి



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ ప్రతినిధులు

మల్లాపూర్: నాచారం ఈఎస్‌ఐ ఆస్పత్రిలో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం ఈఎస్‌ఐ సూపరింటెండెంట్ డాక్టర్ కమలకు తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండీ.యూసఫ్, ఎం.నర్సింహ మాట్లాడుతూ.. సిబ్బందికి రూ.15,600 జీతం ఇవ్వాల్సి ఉండగా, దీనిని అమలు చేయడంలో ఈఎస్‌ఐ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. రాష్ట్రంలోని ఇతర ప్రభుత్వ ఆస్పత్రుల్లో జీతాలు పెంచినప్పటికీ ఈఎస్‌ఐలో పెంచకపోవడం అన్యాయమన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో కాంట్రాక్ట్ కార్మికులు వేణుమాధవ్, నిరంకారి, వాణి, తులసి తదితరులు ఉన్నారు.

కల్యాణ మండపానికి భూమి



భూమి పూజలో పాల్గొన్న కార్పొరేటర్ రాజ్యలక్ష్మి

మౌలాలి: వినాయక్‌నగర్ డివిజన్ సమతానగర్‌లోని శ్రీసాయిబాబా ఆలయంలో కల్యాణ మండపానికి గురువారం కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి, ఆలయ కమిటీ సభ్యులతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేవాలయ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అంద జేస్తానన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి

కాప్రా: గాంధీనగర్‌లో నెలకొన్న మురుగు నీటి సమస్యను పరిష్కరించాలని స్థానిక కాలనీవాసులు అభ్యర్థిస్తున్నారు. డ్రైనేజీ లీకై రోడ్లపై మురుగునీరు పారుతోంది. మురుగు సమస్యతో కాలనీలో రోడ్లపై తిరగలేని పరిస్థితి నెలకొందని, దుర్వాసనతో ఇళ్లల్లో సైతం ఉండలేకపోతున్నామని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో నెలకొన్న సమస్యతో ఎక్కడ రోగాల బారిన పడతామో అని కాలనీవాసులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మురుగు సమస్యను పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



రాష్ట్రంలో పేదల రాజ్యం రావాలి



జెండాను ఆవిష్కరిస్తున్న డీఎస్‌పీ నేతలు

ఉప్పల్: రాష్ట్రంలో దొరల రాజ్యం పోయి పేదల రాజ్యం రావాలని దళిత్ శక్తి ప్రోగ్రాం(డీఎస్‌పీ) రాష్ట్ర అధ్యక్షుడు డా.విశారదన్ మహారాజ్ అన్నారు. గురువారం ఉప్పల్ మండల పరిధిలోని నాచారం, చిలుకానగర్, ఉప్పల్ రింగ్ రోడ్డు, శాంతినగర్‌ల మీదుగా గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో స్వరాజ్య పాదయాత్ర నిర్వహించారు. ఇప్పటికే పలు గ్రామాల్లో పాదయాత్రలు చేసి డీఎస్‌పీ జెండాలను ఆవిష్కరించినట్లు ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ప్రాంతంలో అణగారిన కులాల విముక్తి కోసం పని చేస్తూ వారిని జాగృతం చేయడమే లక్ష్యంగా పాదయాత్రను ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాదయాత్ర ఇన్‌చార్జ్ లక్ష్మణ్, మేడ్చల్ జిల్లా కన్వీనర్ రాజ్‌కమల్, ఉప్పల్ నాయకులు గణేష్, శివకృష్ణ, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కుషాయిగూడ: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన ఘటన గురువారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ ఉపేందర్‌యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా, వనపర్తి మండలం, కండకుంట్ల గ్రామానికి చెందిన బిజ్జి రాజు (30) సైనిక్‌పురిలోని గోకుల్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. నాగారంలోని పెద్దారెడ్డి స్వీట్‌షాపులో పనిచేసే రాజు ఉదయం బైక్‌పై బయలుదేరాడు. ఈ క్రమంలో కుషాయిగూడలోని విక్టరీ ట్రేడర్స్ వద్ద వెనుక నుంచి వచ్చిన గుర్తుతెలియని టిప్పర్ బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాజు అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడి వద్ద లభించిన ఆధారాలతో కుటుంబ సభ్యులకు సమాచారం అందజేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ద్విచక్రవాహనాల దొంగ రిమాండ్



సలీం

ఉప్పల్: ద్విచక్ర వాహనాలను దొంగిలిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కరీంనగర్‌కు చెందిన ఎండీ సలీం(27) ఉప్పల్ బీరప్పగడ్డలో నివాసముంటూ చంగిచర్ల స్లాటర్ హౌస్‌లో బచ్చర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 7న కత్వం హరికృష్ణ సాయంత్రం రామంతాపూర్ డీమార్టు వద్ద తన ద్విచక్ర వాహనాన్ని పార్క్ చేసి వెళ్లాడు. తిరిగి వచ్చి చూడగా వాహనం కనిపించలేదు. దీంతో బాధితుడు ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. గురువారం ఉదయం ఉప్పల్ శ్రీనగర్‌కాలనీలో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా దొంగిలించిన ద్విచక్ర వాహనంపై వచ్చిన సలీం పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించాడు. వెంబడించి అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయాన్ని అంగీకరించాడు. అతడు ఎల్‌బీనగర్ పోలీసుస్టేషన్ పరిధిలో రెండు ద్విచక్ర వాహనాలను సైతం దొంగిలించాడు. మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

తైబజార్

మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని సాయినాథపురం కాలనీలో శుక్రవారం తైబజార్ (వారాంతపు సంత) జరుగుతుంది

వైద్య సేవలు ..

అల్వాల్, మల్కాజిగిరి, జవహర్‌నగర్, మౌలాలి ప్రభుత్వ ఆస్పత్రుల్లో శుక్రవారం హోమియో వైద్యం, జనరల్ చికిత్సలు నిర్వహిస్తారు.

కంపోస్టు ఎరువుల తయారీ అభినందనీయం



కంపోస్టు ఎరువుల తయారీ పిట్‌లను పరిశీలిస్తున్న డీసీ శంకర్

కాప్రా: వంటింటిలోని వ్యర్థాలు, చెట్ల ఆకులతో కంపోస్టు ఎరువుల తయారీ విధానం అభినందనీయమని కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎస్.శంకర్ అన్నారు. కాప్రా డివిజన్ సాకేత్ కాలనీలో స్థానిక కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానికులు కంపోస్టు ఎరువుల తయారీని ప్రారంభించారు. 10 కంపోస్టు పిట్‌లు ఏర్పాటు చేసి కాలనీలో రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్ల ఆకులను, వంటింటిలోని వృథా పదార్థాలతో ఎరువులు తయారు చేస్తున్నారు. కాలనీలో ఉన్న స్థానికులు వారి ఇళ్లలోని వ్యర్థాలను స్వచ్ఛందంగా తీసుకొచ్చి ఈ కంపోస్టు పిట్‌లలో వేసివెళ్తుంటారు. ఇక్కడ తయారైన ఎరువులను కాలనీలోని పార్కులలో చెట్లకు వేస్తున్నారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ నాగరాజు, కాలనీవాసులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అన్ని వర్గాలకు సంక్షేమం



జోడో యాత్రలో పాల్గొన్న రాగిడి లక్ష్మారెడ్డి, సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి

కుషాయిగూడ: అన్ని వర్గాల సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని ఆ పార్టీ నేత రాగిడి లక్ష్మారెడ్డి, ఉప్పల్ బీ బ్లాక్ అధ్యక్షుడు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు గురువారం మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్‌లో హాథ్ సే హాథ్ జోడో యాత్ర నిర్వహించారు. కార్యక్రమానికి వారు హాజరై యాత్ర ప్రారంభించారు. డివిజన్ పరిధిలోని కృష్ణానగర్, మంగాపురం, ఇందిరానగర్, కైలాసగిరి, రాజీవ్‌నగర్, నవోదయనగర్, లక్ష్మీనగర్, వెంకటేశ్వరనగర్ కాలనీల్లో ఇంటింటికి తిరుగుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై ప్రచారం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బీజేపీ పాలనలో గతంలో ఎన్నడూ లేనివిధంగా నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయన్నారు. పెరిగిన గ్యాస్, పెట్రోల్ ధరలతో సామాన్యుడి జీవనం దుర్భరంగా మారిందన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికల హామీలను నెరవేర్చకుండా మరోసారి ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమవుతుందని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు మేకల శివారెడ్డి, రాఘవరెడ్డి, అంజిరెడ్డి, పత్తికుమార్, ప్రభాకర్‌రెడ్డి, ఆగిరెడ్డి, పోలేపాక అంజయ్య, జలగం వెంకటేష్, సముద్రాల కృష్ణమూర్తి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

అల్వాల్: ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ ఆరోపించారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా గురువారం వెంకటాపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులకు రెండు లక్షల రుణ మాఫీ, ఆడబిడ్డలకు ఐదు వందల రూపాలయలకే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇంటికి రూ. 5 లక్షల ఆర్థిక సాయం, రెండు లక్షల ఉద్యోగాల భర్తీ చేస్తామన్నారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళి



చర్లపల్లి పారిశ్రామికవాడలో భగత్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న కార్మిక సంఘాల ప్రతినిధులు

బోడుప్పల్: భగత్‌సింగ్ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని భగత్‌సింగ్ యువజన మండలి అధ్యక్షుడు సాయిని నవీన్‌కుమార్ అన్నారు. బోడుప్పల్ అంబేడ్కర్ చౌరస్తా వద్ద గురువారం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత సమస్యలపై పోరాడి పరిష్కరించుకోవాలని సూచించారు.

మరో పోరాటానికి సిద్ధం కావాలి..

కాప్రా: దేశ స్వాతంత్య్రం కోసం పోరాడి ప్రాణాలర్పించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లు కోరుకున్న సమాజం నేటికీ సిద్ధించలేదని, దోపిడీ, పీడన లేని సమాజం కోసం విద్యార్థులు, యువత మరో పోరాటానికి సిద్ధం కావాల్సిన అవసరం ఉందని ఏఐవైఎఫ్ నేతలు అన్నారు. భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా గురువారం ఏఎస్‌రావునగర్‌లో ఆయన చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు. ఏఐవైఎఫ్, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు సత్యప్రసాద్, సతీష్, ప్రవీణ్, రమేష్, అశోక్ పాల్గొన్నారు.



మల్లికార్జున్‌నగర్‌లో..

గౌతంనగర్‌లో..

గౌతంనగర్: దేశ స్వాతంత్య్రం కోసం భగత్‌సింగ్ చూపిన ధైర్య సాహసాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని వివేకానంద రైసింగ్ సొసైటీ అధ్యక్షుడు కుమ్మరిరాజు అన్నారు. గురువారం గౌతంనగర్‌లో రైసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు.